## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

చిన్నంబావి, అక్టోబర్ 16 : త్వరలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం అధికారులు పరిశీలించారు. అందులో భాగంగా మండలంలోని కొప్పునూరులో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్, ఫర్నిచర్ తదితర మౌలిక వసతుల ఏర్పాటును పూర్తిచేయాలని ఆయన సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్నిశాఖల అధికారులు సహకరించాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రామస్వామి, పంచాయతీ కార్యదర్శి రమేశ్, ఉపసర్పంచ్ ఆనంద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

■ అదనపు కలెక్టర్ దీపక్‌కుమార్



రేమద్దులలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పాన్‌గల్, అక్టోబర్16 : జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్‌కుమార్ సోమవారం మండలంలోని రేమద్దుల, కిష్టాపూర్ గ్రామాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని తాసీల్దార్ రమాబాయిని ఆదేశించారు. అదేవిధంగా పలుసూచనలు తెలియజేశారు. ఆయన వెంట తాసీల్దార్ రమాబాయి, డిప్యూటీ తాసిల్దార్ చక్రపాణి, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎస్సై వేణు, ఏపీవో కురుమయ్య, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేశ్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో మూగజీవి మృతి

కోడేరు, అక్టోబర్ 16 : విద్యుత్‌షాక్‌తో ఓ మూగజీవి మృతి చెందిన ఘటన మండలకేంద్రంలో సోమవారం ఉదయం చోటు చేసుకున్నది. పట్వారి నర్సింహకు చెందిన పశువులు పొలంలో మేత మేస్తున్నాయి. పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. దీని విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు.

## ఎంజీకేఎల్‌ఐ కాల్వలో మరమ్మతు పనులు


పాన్‌గల్, అక్టోబర్16 : మండలంలోని శాగాపూర్, మాధవరావుపల్లి గ్రామాల్లో ఎంజీకేఎల్‌ఐ కాల్వలో పేరుకపోయిన జమ్ము, పూడికతీత పనులకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్ మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటపొలాలకు సాగునీరు అందడంలేదని, కాలువకు సరైన మరమ్మతులులేక సాగునీరు ముందుకు సాగడంలేదని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు అధికారులతో మాటాలడి మట్టి, జమ్మును జేసీబీలతో తొలగింపజేశారన్నారు. కార్యక్రమంలో రైతులు రాములు, వెంకటయ్య, తిరుపతయ్య, కృష్ణయ్య, లక్ష్మయ్య, రవి, ముంత రాము తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో అధికారులు వేగం పెంచాలి

### మండల సభలో ఎంపీపీ సభావట్ భోజ్యానాయక్ వెల్లడి

కొల్లాపూర్, అక్టోబర్ 16 ; ప్రభుత్వం నుంచి మండలానికి మంజూరైన వివిధ అభివృద్ధి పనుల్లో అధికారులు వేగం పెంచాలని ఎంపీపీ సభావట్ భోజ్యానాయక్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం తన అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. సమావేశానికి మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీడీవో చెన్నమ్మ ,ఎంపీవో మనోహర్ హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, ఇందుకు గ్రామాల ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోని నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు.వ్యవసాయశాఖ పద్దుపై మండల వ్యవసాయాధికారి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా రైతుల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను గుర్చి వివరించారు.సమీక్షాలో విద్యా,విద్యుత్,వైద్య ఆరోగ్య,ఐసీడీఎస్‌తో పాటు పలు అంశాల పై ఆయా శాఖల అధికారులు మాట్లాడారు.

# కొనసాగుతున్న దేవీనవరాత్రి ఉత్సవాలు



కోడేరు : నర్సాయపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కేతేపల్లిలో కన్యకా పరమేశ్వరీ ఆలయంలో...

వీపనగండ్ల బస్టాండ్ ఆవరణలో పూజలు చేస్తున్న భక్తులు

కోడేరు, అక్టోబర్ 16 : దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో దేవీనవరాత్రి ఉత్సవాలు రెండో రోజు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. కోడేరు, కోడేరు వడ్డెర కాలనీ, జనుంపల్లి, ఎత్తం, నర్సాయపల్లి గ్రామాల్లో రెండోరోజు దేవీనవరాత్రి ఉత్సవాలను కొనసాగించారు. సోమవారం మంగళగౌరీ అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో భక్తులు కుమ్మరి మల్లేశ్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

**వీపనగండ్లలో..**

వీపనగండ్ల, అక్టోబర్16 : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు దుర్గాదేవీని గాయిత్రీ రూపంలో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవీని పెబ్బేటి జానకిరాం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాజేశ్‌గౌడ్, గోపి, విష్ణు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**పాన్‌గల్‌లో..**

పాన్‌గల్, అక్టోబర్ 16 : దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంతో పాటు కేతేపల్లి రామలింగేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరీ ఆలయాల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కేతేపల్లి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు గాయిత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో మహిళలు కుంకుమార్చన, తీర్థ ప్రసాదం తదితర పూజాకార్యక్రమాలు చేసి అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వీరన్నశెట్టి, రాంబాబు శెట్టి, శ్రీనివాసులుశెట్టి, మాణిక్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు



బెల్లం ఊటను పారపోస్తున్న ఎక్సైజ్ అధికారులు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 16 : జిల్లాలో సోమవారం ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 3 వేల కిలోల నల్ల వెల్లం, 200 కిలోల ఆలమ్, మూడుటైర్ల ఆటోను స్వాధీనపర్చుకోని 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి విక్రయాలు జరుపుతున్న వ్యక్తులపై దాడులు నిర్వహించినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి ఫసియోద్దీన్ తెలిపారు. తెలకపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో జరిగిన దాడుల్లో 3000 కేజీల బెల్లంతో పాటు, 200 కిలోల ఆలమ్, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు. ఎలక్షన్ కోడ్ వచ్చిన నాటినుంచి అచ్చంపేట, కొల్లాపూర్, తెలకపల్లి, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ స్టేషన్‌లలో విస్తృత దాడులు చేస్తూ ఇప్పటివరకు సారాకు సంబంధించి 38 కేసులు, 293 లీటర్ల సారా, 450 కేజీల ఆలమ్, 9290 లీటర్ల బెల్లం ఊట, 3178 కేజీల నల్లబెల్లం, 5 వెహికల్స్, 20 మందిని అరెస్ట్ చేసి 52 మందిని బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. బెల్ట్‌షాప్‌లకు సంబంధించి 15 కేసులు, 56 లీటర్ల మద్యం 45 లీటర్ల బీర్ స్వాధీనం చేసుకుని 13 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న వాటి విలువ రూ.14 లక్షల 50 వేల విలువ ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లా పరిధిలోని 67 వైన్ షాప్‌లను నేడు తనిఖీ చేసి లైసెన్స్ దారులందరికి ఎన్నికల నియమావళి వివరించి అన్ని రికార్డ్సులను ఆడిట్ చేయడం జరిగిందని జిల్లా ఎక్సైజ్ అధికారి ఫయాజుద్దీన్ తెలిపారు.

## సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నం బతుకమ్మపండుగ



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్

కొల్లాపూర్, అక్టోబర్ 16 : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నం బతుకమ్మ పండుగని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీచారి పేర్కొన్నారు. బతుకమ్మ సంబురాల్లో భాగంగా ఆమె సోమవారం రాత్రి పట్టణంలోని తన ఇంటి దుట బతుకమ్మ సంబురాల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బతుకమ్మను వివిధ రకాల తీరొక్క పూలతో అలంకరించి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంబురాలకు ఆ వార్డులోని మహిళలు తరలివచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మీచారి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పండుగలను అధికారికంగా జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్‌సభ్యుడు రుక్మద్దీన్, చంద్రశేఖరాచారి పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావాణికి 11 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 16 : జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా 11 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను వివిధ సమస్యలపై అదనపు కలెక్టర్ రామేశ్వర్‌కు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో అదనపు ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీ కార్యాలయానికి అందిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించిన 9 ఫిర్యాదులు, భార్యభర్తల మధ్య ఘర్షణకు సంబంధించిన ఒక ఫిర్యాదు, చర్యలు తీసుకోవాల్సిందిగా మరో ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

## విద్యార్థి,యువకులు క్రీడల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న రంగినేని అభిలాశ్‌రావు

కొల్లాపూర్, అక్టోబర్ 16 : విద్యార్థి, యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాశ్‌రావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ముక్కిడిగుండంలో హర్షన్న యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాలూకా స్థాయి క్రికెట్ పోటీలను సోమవారం ఆయన బ్యాట్‌తో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు దేహధారుఢ్యంతో పాటు మానసికోల్లాసాన్నిస్తుందన్నారు. అంతేకాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో మంచి స్నేహసంబందాలు దోహదపడుతాయన్నారు.ఈ పోటీలకు 20 టీంలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భోజ్యానయక్,సర్పంచ్ దశరథం నాయక్, మండల అధ్యక్షుడు రామచందర్ యాదవ్ పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబురాలు



పాన్‌గల్‌లో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్న ఉద్యోగులు

పాన్‌గల్, అక్టోబర్ 16 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు ఆటపాటలతో బతుకమ్మ సంబురాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలను పేర్చి తయారు చేసిన ముద్దపప్పు బతుకమ్మను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి ప్రత్యక్షంగా తిలకించడమే కాకుండా ఆటపాటల్లో పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది ఆనందోత్సవాలతో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో రఘురాం పాల్గొన్నారు.

## మార్కెట్‌కు 250 క్వింటాళ్ల మొక్కజొన్న

కొల్లాపూర్,అక్టోబర్ 16;కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో విక్రయించేందుకు గాను ఏడు మంది రైతులు సోమవారం 250 క్వింటాళ్ల (500బస్తాలు)మొక్కజొన్న వచ్చాయి.యార్డులో మొక్కజొన్న ధాన్యం నాణ్యతను మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్,వ్యాపారస్తులు పరిశీలించారు.అయితే ప్రభుత్వం రైతుకు మొక్కజొన్న మద్దతు ధరను క్వింటాల్‌కు రూ,2150లు,తక్కువ ధర రూ,2002,మోడల్ ధర రూ,2020లు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్ చెప్పారు.ఈకార్యక్రమంలో వ్యాపారులు కిషోర్,శ్రీనివాసులు,రైతులు సీతారాంనాయక్,గోపాల్,కృష్ణ,అర్జున్ తదితరులున్నారు.